## క్లుప్తంగా

### ఎంఈఓ-2 గా ఝాన్సీలత బాధ్యతల స్వీకరణ



కొల్లిపర: కొల్లిపర మండల విద్యాశాఖాధికారి(ఎంఈఓ-2)గా కె.ఝాన్సీలత మంగళవారం విద్యాశాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆమె నెల్లూరు జిల్లాలో ఇందుకూరుపేట గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తూ ప్రమోషన్ పై కొల్లిపర మండలంలో ఎంఈఓ -2 గా వచ్చినట్లు తెలిపారు.

### కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన



తెనాలిఅర్బన్: 30వ వార్డులోని ఎస్సీ కమ్యూనిటీ హాల్ రెండోవ అంతస్తు నిర్మించేందుకు మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ శంకుస్థాపన చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా వచ్చిన నిధులతో దీనిని నిర్మిస్తున్నట్లు ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కొమ్మురబత్తిని జయపాల్, పేరం సంజీవరెడ్డి, రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, పలువురు 30వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

### ఇంటి వద్దకే వైద్యసేవలు

తూములూరు(కొల్లిపర): రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులో తెచ్చిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం రోగులకు, పేదలకు వరంగా మారిందని మండల వైద్యాధికారి డాక్టర్ చిక్కాల లక్ష్మిసుధ అన్నారు. మంగళవారం మండలంలోని తూములూరు గ్రామంలో గ్రామ సచివాలయం పరిధిలో ఫ్యామిలీ ఫిజీషియన్‌లో భాగంగా రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అనంతరం సిబ్బందితో కలిసి దీర్ఘకాలిక రోగులు, వయోవృద్ధులు, గర్భిణులు, బాలింతల ఇళ్లకు వెళ్లి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో 104 సిబ్బంది బొమ్ము కోటిరెడ్డి, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

### ద్విచక్ర వాహనాల తనిఖీ

తెనాలిరూరల్: డీఎస్పీ బి. జనార్దనరావు ఆదేశాల మేరకు తెనాలిలో పోలీసులు ద్విచక్ర వాహనాల తనిఖీని మంగళవారం సాయంత్రం చేపట్టారు. నంబర్ ప్లేట్‌లు లేకుండ, నంబర్లు సరిగా లేని వారికి గుర్తించి కౌన్సెలింగ్ ఇచ్చారు. తెనాలి బోస్‌రోడ్డులో వన్‌టౌన్ సీఐ కె. చంద్రశేఖర్, ఎస్ఐ ఎం. ఉమామహేశ్వరరావు వాహనాల తనిఖీ చేపట్టారు. 12 వాహనాలకు నంబర్ ప్లేట్లు సరిగా లేకపోవడం గుర్తించి వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. మరో నాలుగు బైక్‌లు, ఒక ఆటో పత్రాలు సరిగా లేకపోవడంతో పత్రాలు లేకపోవడం గుర్తించారు. మండలంలోని పెదరావూరు వద్ద రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు వాహనాలు తనిఖఱు చేశారు. 15 మందికి డ్రైవింగ్ లైసెన్స్ లేకపోవడం, 10 వాహనాలకు పత్రాలు లేకపోవడాన్ని గుర్తించారు. నిబంధనలు పాలటించకపోతే కేసులు నమోదు చేస్తామని పోలీసులు వాహనదారులను హెచ్చరించారు.

### 24న 'స్వయంసిద్ధ'పై చర్చాకార్యక్రమం

తెనాలి: ఆహ్వానం పత్రిక సంపాదకురాలు 'ఆహ్వానం లక్ష్మి' సంస్మరణలో నిర్వహిస్తున్న ప్రతినెలా చర్చా కార్యక్రమంలో భాగంగా ఈనెల 24న భండారు విజయ, పి.జ్యోతి సంపాదకత్వంలో వెలువడిన 'స్వయంసిద్ధ' ఒంటరి మహిళల జీవనగాథలు కథాసంకలనంపై చర్చ జరగనుంది. పట్టణానికి చెందిన సాహితీ, సాంస్కృతిక వేదిక 'భిన్నస్వరాలు' ఆధ్వర్యంలో ఈరోజు సాయంత్రం ఆరు గంటలకు ఏర్పాటయే సభకు సంస్థ కన్వీనర్ కేవీ రాఘవరెడ్డి సమన్వయకర్తగా వ్యవహరిస్తారు. దళిత బహుజన రచయిత్రి డాక్టర్ చల్లపల్లి స్వరూపరాణి, విరసం అధ్యక్షుడు అరసవిల్లి కృష్ణ చర్చను ప్రారంభిస్తారు. స్వయంసిద్ధ కథా రచయిత్రులు తమ కథా నేపథ్యాన్ని వివరిస్తారని నిర్వాహకులు తెలియజేశారు.

### కౌలు రైతులు గుర్తింపు కార్డులు పొందండి

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని కౌలు రైతులందరూ గుర్తింపు కార్డులు తీసుకోవాలని దుగ్గిరాల తహసీల్దార్ మల్లేశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన కౌలు రైతులందరూ సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారిని, గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి కౌలు రైతు గుర్తింపు కార్డులను పొందాలని, గత సంవత్సరం కౌలు రైతు కార్డు పొంది, ఈ సంవత్సరం కూడా అవే పొలాలను కౌలు చేసుకుంటున్నట్లయితే వాటిని రెన్యువల్ చేసుకోవాలని ఇందుకు సంబంధించి భూమి కలిగిన రైతు పట్టాదారు పాసు పుస్తకం జిరాక్స్, రైతు ఆధార్ కార్డు జిరాక్స్, ఫోన్ నెంబర్, కౌలు రైతు ఆధార్ జిరాక్స్, ఫోన్ నెంబర్, ఫొటోలతోపాటు భూమి కలిగిన రైతు అంగీకారపత్రాన్ని తీసుకుని సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని సూచించారు.

# ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు

**ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్**



దంపతులకు అందుతున్న సంక్షేమ పథకాల గురించి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి రూరల్: సంక్షేమం, అభివృద్ధే పరమావధిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన జరుగుతోందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. తెనాలి మండలం బుర్రిపాలెం గ్రామంలో మంగళవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు నిర్వహించిన 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే శివకుమార్ ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పాలనపై ప్రజల స్పందన తెలుసుకోవడంతో పాటు, ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు, స్థానికంగా ఉన్న గ్రామంలోని సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులను ఇంటింటికీ తీసుకు వెళ్లి ప్రభుత్వం అందించిన పథకాల వివరాలను తెలియజేశారు. కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజాప్రతినిధులు నేరుగా ప్రజల వద్దకు వెళ్లి వివరించడం, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు వారధిగా ఈ కార్యక్రమం ఉందన్నారు. ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అందించిన లబ్ధి వివరిస్తూ ప్రజల అవసరాలను తెలుసుకునేందుకు, అర్హత ఉండి సాంకేతిక, ఇతర కారణాలతో సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి వారికి లబ్ధి చేకూర్చేందుకు వీలుగా కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపొందించారన్నారు. గత మూడేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో తెనాలి నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా రూ. 1500 కోట్ల లబ్ధిని నియోజకవర్గ ప్రజలకు అందించినట్టు ఎమ్మెల్యే శివకుమార్ తెలిపారు. బుర్రిపాలెం గ్రామానికే రూ. 8.50 కోట్ల లబ్ధి చేకూరిందని తెలిపారు. చిన పల్లెలో డ్రెయిన్లు, విద్యుత్ దీపాలు లేక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పర్యటిస్తుండగా ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను నాలుగుగ నెల్లో పరిస్కరిచేందుకు ప్రణాళిక రూపొందించినట్టు తెలిపారు. ఎమ్మెల్యే వెంటఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ గోపిశెట్టి రమాదేవి, అడుసుమల్లి శ్రీను, అడుసుమల్లి అజయ్, శాఖమూరు రంగయ్య, రాచపూడి రత్నం, రెల్లి మధు, ప్రేమ్‌కుమార్, లాజర్, మరియదాసు, నాగరాజు ఇతర పార్టీ నేతలు, కార్యకర్తలు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఉన్నారు.

# గృహ నిర్మాణదారులకు సువర్ణావకాశం

కొల్లిపర: నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకం ద్వారా ఇళ్లు నిర్మించుకుంటున్న పేద ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పిందని, ఇప్పటి వరకూ ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించని లబ్ధిదారులతో పాటు నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్న వారికి సైతం నిర్మాణాల కోసం అడ్వాన్స్ పేమెంట్ అందిస్తోందని తహసీల్దారు జి.నాంచారయ్య , ఇన్‌చార్జి ఎంపీడీఓ వి.చంద్రమోహన్, హౌసింగ్ ఏఈ సుబ్బారావు అన్నారు. మంగళవారం వివిధ గ్రామాల్లో గ్రామ సచివాలయంలో ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలు కోసం అందిస్తున్న అడ్వాన్స్ పేమెంట్ గురించి సచివాలయం సిబ్బంది, గృహ లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వం ఒక్కో లబ్ధిదారుకు ఇళ్ల నిర్మాణం కోసం ముందస్తుగా రూ.20వేల చొప్పున బిల్లు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. జగనన్న కాలనీలో ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక వసతులు గురించి వివరించారు. సచివాలయంలోని అసిస్టెంట్ ఇంజినీరింగ్‌లు లబ్ధిదారులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి ప్రతి లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండలంలోని గృహ లబ్ధిదారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజినీరింగ్‌లు , లబ్ధిదారులు పాల్గొన్నారు.

# మహిళ ఆత్మహత్య



చంద్రావతి మృతదేహం

తెనాలిరూరల్: అనారోగ్యంతో బాధపడుతూ చూసే వారు ఎవరూ లేకపోవడంతో ఆవేదన చెందిన ఓ మహిళ ఆత్మహత్యకి పాల్పడిన ఘటన మంగళవారం జరిగింది. తెనాలి మండలం సంగం జాగర్లమూడి గ్రామంలోని కాల్వలోకి దూకి ఆమె ఆత్మహత్యకు పాల్పడింది. గుంటూరు వెంకట్రావు నగర్ 4వ లైనుకు చెందిన మద్ది చంద్రావతి(54) క్యాన్సర్ ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఉంది. మంగళవారం వేజెండ్ల నుంచి తెనాలి ఆర్టీసీ బస్సులో జాగర్లమూడి గ్రామం వద్దకు చేరుకుంది. గ్రామంలోని కొమ్మమూరు కాల్వలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికంగా పనులు చేసుకుంటున్న రైతులు గమనించి బయటకు తీసినా అప్పటికే మృతి చెందింది. చంద్రావతి తన పుట్టిల్లు అయిన స్వగ్రామం వేజండ్లలో గ్రామంలో ఉంటూ వైద్య సేవలు పొందుతోంది. ఇంట్లో ఉన్న భార్య కనిపించకపోయే సరికి భర్త నరసింహారావు ఆమెను వెతుక్కుంటూ ఆందోళన గురయ్యారు. సంగం జార్లముడి కాలువలో మహిళా ఆత్మహత్య ఘటన తెలుసుకుని ఆయన అక్కడికి చేరుకుని బోరున విలపించారు. మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు.
కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్ఐ సీహెచ్. వెంకటేశ్వర్లు తెలిపారు.

## ప్రణాళికబద్ధంగా చదివితే ప్రతి విద్యార్థి ఒక ఆణిముత్యమే



కసుకుర్తి జయశాలిని సత్కరిస్తున్న సర్పంచ్ పవన్‌కుమార్, హెచ్‌ఎం శివపార్వతి

తెనాలిటౌన్: ప్రణాళికబద్ధంగా కష్టపడి చదివితే ప్రతి విద్యార్థి ఒక ఆణిముత్యమేనని నందివెలుగు గ్రామ సర్పంచ్ ధూళ్ళిపాళ్ళ పవన్‌కుమార్ పేర్కొన్నారు. రూరల్ మండలం నందివెలుగులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం గత ఏడాది పదో తరగతిలో పాఠశాల స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు అభినందన సభ ఏర్పాటు చేశారు. మండలంలో 569 మార్కులతో ద్వితీయ స్థానం సాధించిన నందివెలుగు జాషువానగర్‌కు చెందిన కసుకుర్తి జయశాలిని సర్పంచ్ పవన్‌కుమార్, హెచ్‌ఎం శివపార్వతిలు సత్కరించి జ్ఞాపికలు, ప్రశంస పత్రాలు అందజేశారు. సభకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శివపార్వతి అధ్యక్షత వహించారు. సభలో సర్పంచ్ పవన్‌కుమార్ మాట్లాడుతూ అత్యాధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఆణిముత్యాలుగా పిలవడం సముచితంగా ఉందన్నారు. కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ రామకృష్ణ, కసుకుర్తి దానియేల్, కమాదుల స్వామి, ధూళ్ళిపాళ్ళ దుర్గాప్రసాద్, కసుకుర్తి జోసఫ్, జంపని చంటి, అరుణరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 17 ఏళ్ల తర్వాత ఔట్‌పాల్ డ్రెయిన్ పూడికతీత

**ఎమ్మెల్యే ఆర్కే చొరవపై రైతుల హర్షం**



కాలువలో పూడికతీత నిర్వహిస్తున్న ప్రొక్లయినర్

తాడేపల్లిరూరల్ : రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య అయిన మురుగునీటి సమస్యను పరిష్కరించేందుకు తాడేపల్లి రూరల్ ప్రాంతంలో పలు ప్రాంతాలను కలుపుతూ డ్రెయిన్ పూడికతీత పనులను మంగళవారం చేపట్టారు. చిర్రావూరు, గుండిమెడ, మంగళగిరి రూరల్‌లోని రామచంద్రాపురంలో ఔట్‌పాల్ డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో అధిక వర్షాలు పడినపుడు పంటపొలాలు మునిగిపోవడంతోపాటు ఆయా ప్రాంతాల్లో మురుగునీరు పొలాల్లోకి వచ్చి చేరడంతో రైతులు ఆరు కాలం కష్టపడి తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉండేది. చిర్రావూరు వైఎస్సార్ సీపీ కన్వీనర్, ఇప్పటం సొసైటీ ప్రెసిడెంట్ మేకల సాంబశివరావు తదితరులు ఎమ్మెల్యే ఆర్కే దృష్టికి సమస్యను తీసుకువెళ్లడంతో స్పందించిన ఆయన కార్పొరేషన్ అధికారులతో మాట్లాడి రూ.9.50 లక్షలు కేటాయించి డ్రెయిన్ పూడికతీత పనులు చేపట్టారు. దీనితో పాటు ఆంధ్రరత్న పంపింగ్‌స్కీమ్ పంటకాలువ సైతం పూడికతీత పనులను చేస్తున్నారు. ఈ పూడికతీత వల్ల గుండిమెడలోని కొంతభాగం, ప్రాతూరులోని కొంతభాగం, చిర్రావూరు, రామచంద్రాపురం పంటపొలాల్లో మురుగునీరు రేపల్లె కరకట్ట వెంబడి దిగువ ప్రాంతానికి పనులు చేపట్టినట్లు డీఈ కృష్ణారెడ్డి తెలిపారు. భవిష్యత్తులో పక్కా డ్రెయిన్ నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు.

# ఎంఈఓ, ఎంఈఓ-2 బాధ్యతల స్వీకారం



ఎంఈఓ జి.సత్యనారాయణమూర్తి, ఎంఈఓ-2 డి.నాగేశ్వరరావులను సత్కరిస్తున్న నాయకులు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి మండల విద్యాశాఖాధికారిగా జి.సత్యనారాయణమూర్తితోపాటు ఎంఈఓ-2 డి.నాగేశ్వరరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. జి.సత్యనారాయణమూర్తిని, డి.నాగేశ్వరరావులను ఎస్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి కె.జోజప్ప, మండల శాఖ అధ్యక్ష ప్రధానకార్యదర్శులు బి.సురేష్‌బాబు, ఎల్.రవీంద్రరావు, గౌరవాధ్యక్షులు ఎస్.వరకుమార్ తదితరులు పాల్గొన్నారు.

**యూటీఎఫ్ అభినందనలు**

ఎంఈఓ జి.సత్యనారాయణమూర్తి, ఎంఈఓ-2గా బాధ్యతలు స్వీకరించిన డి.నాగేశ్వరరావులను యూటీఎఫ్ మండల అధ్యక్షకార్యదర్శులు ఆనంద్ కుమార్, సుబ్బారావులు మంగళవారం కలసి అభినందించారు. అనంతరం వారిని సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఆంజనేయులు, ధనరాజారావు, రాధాకృష్ణ, షంషాద్ బేగం, అన్నపూర్ణ, విజయరాణి, సుధారాణి, సుజాత, బురాన్, గఫార్, బుచ్చిబాబు, రామచంద్రారెడ్డి, ధన్వంతరి, మున్వర్, వెంకయ్య, బెన్హర్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం

తెనాలిటౌన్: ఐతానగర్‌లోని గోలిడొంక రోడ్డులో ఐటీఐ ఎదురు ఉన్న అపార్ట్‌మెంట్‌లో గురువారం అంతర్జాతీయ యోగ దినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఎస్వీయోగ కన్వీనర్ ఎం.రమణయ్య మంగళవారం తెలిపారు. ముఖ్యఅతిథిగా శ్రీ వెంకటేశ్వరయోగా సేవా కేంద్రం వ్యవస్థాపకులు వెంకటేశ్వర యోగి గురూజీ పాల్గొని యోగా విశిష్టతను తెలియజేస్తారని తెలిపారు. యోగా సాధకులు పాల్గొనాలని ఆయన కోరారు.

### యువకుని మృతదేహం లభ్యం

మంగళగిరి: క్షణికావేశంలో పాడుబడిన బావిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడిన యువకుని మృతదేహం మంగళవారం లభ్యమైంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... కార్పొరేషన్ పరిధిలోని యర్రబాలెం రైస్‌మిల్ వీధికి చెందిన శిఖా గోపాల్ (35) సోమవారం సాయంత్రం క్షణికావేశంలో తన నివాస గృహం సమీపంలోని పాడుబడిన బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు బావిలోకి దిగి గోపాల్‌ను రక్షించే సాహసం చేయలేకపోయారు. అప్పటికే చీకటి పడటంతో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సహాయ చర్యలు కొనసాగించలేకపోయారు. ఈ నేపథ్యంలో మంగళవారం గజ ఈతగాళ్లను రప్పించి గాలించారు. పాడుబడిన బావిలో చెత్త చెదారంతోపాటు పాత చెట్టు కొమ్మలు కొట్టేసి వేశారు. నీటిలో అడుగున ఉన్న చెట్టు కొమ్మల మధ్యలో గోపాల్ ఇరుక్కుపోయి మృతి చెందాడు. బావి మొత్తం పాచితో పాకుడు పట్టింది. తీవ్ర దుర్గంధం వెదజల్లుతుంది. అతికష్టం మీద గోపాల్ మృతదేహాన్ని గజ ఈతగాళ్లు ఎంతో శ్రమించి బయటకు తీశారు. శవ పరీక్షల అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు పోలీసులు అందించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### బహిరంగ సభను జయప్రదం చేయండి

తాడేపల్లిరూరల్: రైతు సమస్యలపై విజయవాడలో ఈనెల 30న జరిగే బహిరంగసభ, ధర్నాను జయప్రదంచేయాలని సీపీఎం నాయకులు జొన్నా శివశంకరరావు కోరారు. మంగళవారం ఉండవల్లిలో రాజధాని రైతు సంఘం విస్తృత సమావేశం నిర్వహించారు. సమావేశానికి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ సబ్సిడీ విధానాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకుంటుందని, గిట్టుబాటు ధర రైతుకు రావడం లేదని, కరెంటు చార్జీలు విపరీతంగా పెంచివేశారని విమర్శించారు. రాజధాని డివిజన్ అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు వీరాస్వామి పాల్గొన్నారు.

### ఎస్ఐ గిరిబాబు బాధ్యతల స్వీకారం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించేందుకు మరో ఎస్ఐను నియమించారు. ఆయన మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో వట్టిచెరుకూరులో ఎస్ఐగా పనిచేసిన జి.గిరిబాబు కొంతకాలం లాంగ్‌లీవ్‌పై వెళ్లారు. ఇప్పుడు తాడేపల్లి ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు. తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌కు ఎస్ఐగా వచ్చిన గిరిబాబుకు తాడేపల్లి పోలీసులు అభినందనలు తెలిపారు.

### టిఫిన్ బండ్లు పంపిణీ

తాడేపల్లిరూరల్ : నగర పాలక సంస్థ పరిధిలోని బ్రహ్మానందపురం, డోలాస్‌నగర్ ప్రాంతాలకు చెందిన కందుకూరి భాగ్యలక్ష్మి, మకం మేరీ, దారా మాధవి భాయ్, బొబ్బొలి సరోజిని, షేక్ మహబున్నీసాలకు మంగళవారం ఎమ్మెల్యే ఆర్కే సహకారంతో తోపుడు బండ్లను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్‌రాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ మేకా వెంకటరామిరెడ్డి, గుంటూరు జిల్లా ఎస్టీ సెల్ కన్వీనర్ మేడా వెంకటేశ్వరరావు (పండు), గుంటూరు జిల్లా ఎస్టీ సెల్ ప్రధానకార్యదర్శి చిన్నపోతుల దుర్గారావు, తాడేపల్లి పట్టణ ఎస్సీ యూత్ మైనార్టీ సెల్ అధ్యక్షులు ముదిగొండ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

**మృతుడి దహన సంస్కారాలకు రూ.15వేలు సాయం**

మంగళగిరి: అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన కాజ ఎస్సీ కాలనీకి చెందిన చిలకలపూడి ఫ్రాన్సిస్ దహన సంస్కారాల నిమిత్తం ఎమ్మెల్యే ఆర్కే రూ.15వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. స్థానిక పార్టీ నాయకుల ద్వారా మృతుడి కుటుంబానికి రూ.15వేలు అందించారు.

# రైతులు భూసార పరీక్షలు చేయించాలి

**ఏఓ ప్రేమ్‌సాగర్**



చినరావూరు ఏరియాలో మట్టి నమోనాలు సేకరిస్తున్న ఆర్‌బికె వ్యవసాయ అసిస్టెంట్ నీలవేణి

తెనాలిటౌన్: రైతులు తమ పొలాల్లో భూసార పరీక్షలు తప్పని సరిగా చేయించాలని మండల వ్యవసాయాధికారి వి.ప్రేమసాగర్ తెలిపారు. మండలంలోని చినరావూరు గ్రామ పరిధిలో మంగళవారం భూసార పరీక్షలు నిమిత్తం మట్టి నమోనాలను సేకరించారు. వ్యవసాయాధికారి ప్రేమ్‌సాగర్‌తో పాటు రైతుభరోసా కేంద్ర వ్యవసాయ అసిస్టెంట్ నీలవేణి మట్టి నమోనాను సేకరించారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి ఏఓ ప్రేమ్‌సాగర్ మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రతి ఆర్బీకె నుంచి 30నుంచి 40 వరకు మట్టి నమూనాలను రైతు భరోసా కేంద్ర సిబ్బంది సేకరించి భూసార పరీక్ష కేంద్రం నిమిత్తం గుంటూరుకు పంపాలని సూచించారు. మండలంలో 750 మట్టి నమోనాలను భూసార పరీక్షల నిమిత్తం పంపుతున్నట్లు తెలిపారు. వీటివల్ల రైతులకు నత్రజని, భాస్వారం, పొటాష్ ఎరువులు ఏ మేరకు వేయాల్లో తెలుస్తుందన్నారు. గ్రామాల్లోని ఆర్బీకెలలో పచ్చిరొట్ట విత్తనాలను సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. రైతులు పీఎం కిసాన్ కొరకు ఈకెవైసీ చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

# జగ్గడిగుంటపాలెంలో వరిగడ్డివాములు దగ్ధం



గడ్డివాములను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది, స్థానికులు

తెనాలిరూరల్: తెనాలి మండల పరిధిలోని జగ్గడిగుంటపాలెంలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. గ్రామానికి చెందిన పాడి రైతులు కుర్రా శివరామకృష్ణ ప్రసాద్, కుర్రా సీతారామయ్యలకు చెందిన వరి గడ్డివాములు ప్రమాదంలో పూర్తిగా కాలిపోయాయి. సోమవారం సాయంత్రం సమయంలో విద్యుత్ తీగలకు రాపిడి జరిగి నిప్పురవ్వలు చెలరేగి గడ్డివాములపై పడడం వల్ల ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. నిప్పు రవ్వలు గడ్డివాములపై పడడంతో ఒక్కసారిగా బారీగా మంటలు చెలరేగాయి. భారీ ఎత్తున మంటలు, పొగలు అలముకోవడంతో స్థానికులు అప్రమత్తమై మంటలను అదుపు చేసే ప్రయత్నం చేస్తూనే అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది సోమవారం రాత్రి నుంచి మంటలను ఆర్పుతూనే ఉన్నారు. శివరామకృష్ణ ప్రసాద్ కు చెందిన 13 ఎకరాల గడ్డివామి, సీతారామయ్యకు చెందిన 12 ఎకరాల గడ్డివామి అగ్నికి పూర్తిగా ఆహుతయ్యాయి. సోమవారం సాయంత్రం చెలరేగిన మంటలు, పొగ మంగళవారం మధ్యాహ్నం వరకూ కొనసాగడంతో అగ్నిమాపక సిబ్బంది 20 గంటలకు పైగా అక్కడే ఉండి మంటలను అదుపుచేస్తూ ఉన్నారు. నిరంతరాయంగా శ్రమించి అతికష్టం మీద మంటలు, పొగను అదుపు చేయగలిగారు. చుట్టుపక్కల నివాసాలకు మంటలు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు అందరినీ అప్రమత్తం చేశారు. ప్రమాదంలో సుమారు రూ. 3 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధితులు, స్థానికులు తెలిపారు. మరోవైపు అగ్నిప్రమాద బాధితులను మంగళవారం రైతు సంఘ నాయకులు పరామర్శించారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి తదితరులు బాధిత పాడిరైతులను పరామర్శించి ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. నష్టపోయిన పాడిరైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ప్రమాదం కారణంగా మూడు లక్షల దాకా ఆస్తినష్టం జరిగిందని, గడ్డివాములు దగ్ధం కాగా మిగిలిన బూడిద తొలగించడానే వారికి రూ. 5 వేల దాకా ఖర్చు అవుతుందని అన్నారు.

# వర్షంతో సేదతీరిన ప్రజలు



గంగానమ్మ గుడి వద్ద రోడ్డుపై నిలిచిన వర్షం నీరు



వర్షం పడుతుండడంతో జలమయమవుతున్న రోడ్లు

తెనాలిఅర్బన్: తెనాలిలో మంగళవారం మధ్యాహ్నం కుండపోత వర్షం కురిసింది. దాదాపు రెండు నెలల నుంచి వేసవిలో అల్లాడిన ప్రజలు వర్షంతో కొంత సేదతీరారు. ఉదయం నుంచి ఉక్కపోత పోస్తుండగా మధ్యాహ్నం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. సుమారు గంటన్నరపాటు వర్షం కురుస్తునే వచ్చింది. దీంతో పట్టణంలోని దాదాపు అన్ని ప్రధాన రహదారులు జలమయ్యామయ్యాయి. అలాగే మురుగు కాల్వలు పొంగి రోడ్డుపై మురుగు చేరింది. వర్షం ఆగిన కొద్ది సేపటికే రోడ్లుపై నీరు కాల్వల ద్వారా బయటకు వెళ్తంది. మొత్తం మీద వేసవితాపంతో అల్లాడుతున్న ప్రజలు కొంత మేర సేదతీరారు.

# 150 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ

**వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం**



దివంగత నేత డాక్టర్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న ముగ్గురోడ్డు మహిళలు

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని నివాస స్థలాల పట్టాలు పొందిన మహిళలు మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని ముగ్గురోడ్డు సెంటర్‌లో దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి క్షీరాభిషేకం చేసి నివాళులర్పించారు. ముగ్గురోడ్డు ప్రాంతంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన దాదాపు 150 మందికి ఇళ్ల పట్టాలు అందజేశారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు ముదిగొండ ప్రకాష్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ మాటలు చెప్పే ప్రభుత్వం కాదని, ఇచ్చిన మాట ప్రకారం ముగ్గురోడ్డులో ఇళ్లులేని నిరుపేదలతోపాటు రైల్వేస్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో, ఎమ్మెల్యే ఆర్కే, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి పట్టాలు పంపిణీ చేశారని, మరో ఆరు నెలలో ఇళ్ల నిర్మాణం పూర్తి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇత్తడి పండు, జి.హైమావతి, రాణి, తిరుపతమ్మ, గోపి రవీంద్ర, ప్రభాకర్, నాగభూషణం, మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

**ఎన్నోసార్లు దరఖాస్తు చేసుకున్నాం**



ఇరవై ఏళ్లుగా ఇళ్లస్థలాల కోసం దరఖాస్తు చేసుకుంటూనే ఉన్నాం. రాజధానిలో కట్టిన టిడ్కో ఇళ్లకు సైతం దరఖాస్తు చేసుకున్నాం. అప్పట్లో కొంతమందికి మాత్రమే ఇళ్ల స్థలాలు ఇచ్చారు. ఇప్పుడు మా వాడకట్టులో ఎవరికైతే సొంత ఇల్లు లేదో, ఎవరైతే రైల్వే స్థలాల్లో ఇళ్లు వేసుకున్నారో వారందరికీ ఇళ్లస్థలాలు కేటాయించారు. ముఖ్యమంత్రి జగన్‌కు రుణపడి ఉంటాం.

– వరగాని సుబ్బులు

## రైతు సంఘం ఆధ్వర్యంలో సహాయ నిధి సేకరణ

తాడేపల్లిరూరల్ : త్రిపుర రాష్ట్రంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలపైన బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ గూండాలు దాడులు చేస్తూ విధ్వంసం సృష్టిస్తున్నారని ఏపీ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్నా శివశంకరరావు విమర్శించారు. దాడులకు గురై, నష్టపోయిన వారిని ఆదుకునేందుకు మంగళవారం రైతు సంఘం ఆధ్వర్యంలో కొలనుకొండ జాతీయ రహదారి పక్కన వ్యాపార సముదాయాల వద్ద సహాయ నిధి సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, కాట్రగడ్డ శివన్నారాయణ, సామాల మోహన్‌రావు, బాణావత్ నాగేశ్వరరావు, సురేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.